# పిల్లి చేసిన సహాయం

(కథానిక)

ఎలాగో. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకి పని ముగించుకుని ఇంటికిచేరాను, ఒక్క సాయంత్రంమేనా విశ్రాంతి తీసుకోవచ్చును కదా అని సంతోషిస్తూ.

ఆఫీసుఫైళ్ళూ, రిమైండర్లూ, టెలిగ్రాంలూ, కాలింగుగంటలూ, వీటన్నిటిమధ్యా నలిగిపోతున్న నాకు ఆ ఒక్క సాయంత్రపు విశ్రాంతీ ఎంత ప్రియమైనది!

ఇంట్లోకివచ్చి కోటు విప్పాను. శాంత నవ్వుతో "ఎలాగో ఈ ఒక్క సాయంత్రమూ ఉన్నారు. సినీమాకు పోదాం, ఏం?" అన్నది కాదనడానికి వీల్లేకుండా.

టీ త్రాగుతున్నాను శాంతతో బీచికిపోదామని అనుకుంటూ. ఫోన్ మోగింది ఫైర్ ఇంజన్ గంటలాగ.

ఆఫీస్ నించి ..

వెంటనే విజయనగరం స్టేషన్‌లో తనని కలుసుకొమ్మని డిస్ట్రిక్టు కలెక్టరు మెసేజ్ ఇచ్చాడట.

కట్టుకున్న పేకమేడలు కూలిపోగా, శాంత మొహం వాలిపోయింది. నాకు కోపం వచ్చేసింది మానవుణ్ణి యంత్రాలుచేసే ఈ ఉద్యోగాలమీద...

అయిదూఇరవైకి బండి...

బయలుదేరాను. టిక్కెట్టు తీసుకొని, ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో కూర్చున్నాను. బండి కదిలింది పెట్టెలో ఒక్కణ్ణే ఉన్నాను. ఒంటరితనం ఎప్పుడో కట్టుకొన్న గాలిమేడల అంతస్థులకి తీసికొని వెళ్ళింది.

చిట్టివలస స్టేషన్ దాటుతోంది రైలు నెమ్మదిగా. ఒక్క పరుగులో ప్లాటుఫారం దాటి మరొక్క ఊపులో నా కంపార్టుమెంటులోకి ఉరికాడు, ఎనిమిది సంవత్సరాల క్రిందట ఉద్యోగరీత్యా వదిలేసిన స్నేహితుడు రాజు. హఠాత్తుగా ఇలాగ కలుసుకున్నా మేమో కొద్దిక్షణాలు ఎవ్వరమూ మాట్లాడ లేక పోయ్యాము.

"ఎంత అదృష్టంరా! ఎక్కడికి వెళ్తున్నావు?" అంటూ ఎనిమిది సంవత్సరాల ప్రేమని బతికించుతూ రాజు నా ప్రక్క కూర్చుని నా చేతులు పట్టుకున్నాడు. వాడి కళ్ళు ఆర్ద్రాలై విద్యుద్దీపకాంతిని తమలో ప్రస్ఫుటంగా ప్రతిబింబింప చేసుకుంటున్నాయి.

వాడికి ఖరగ్‌పూరులో ఉద్యోగమట. భార్యకి పురిటిరోజులని అత్తవారింటిలో దిగబెట్టి వెళ్ళిపోతున్నాడు.

రెండునిముషాలు గడిచాక మామూలుగా అన్నాను, "తలవెంట్రుక వాసిలో ఎవరం తప్పినా మళ్ళీ ఎన్నేళ్ళకి కలుసుకొందుమో" అని.

రాజు నవ్వాడు. తరవాత "ఒక్కక్షణం చాలురా జీవితాలు మార్చేసేందుకు—జారిన ఒక్కమాటేనా చాలు" అన్నాడు.

"అదేమిట్రా వేదాంతం మాట్లాడుతున్నావు? ఏమేనా కథ ఉందేమిటి? మాటజారడమేమిటి? చెప్పుచెప్పు" అన్నాను. స్వతహాగా కథలంటే సరదాఅయి కాదు. వాడి కథ విందామని కుతూహలంతో.

"సరే, మన కలయికలాగే ఉంటుంది లే కథ విను" అని ఇలాగ చెప్పాడు.

"ఒకనాడు ఆఫీస్‌లో చాలాగొడవజరిగింది. పెర్సనల్ సూపరింటెండెంటు అరవ్వాడులే. హఠాత్తుగా వచ్చాడు ఆఫీసు చెకింగుకి.

"స్వతహాగా జాగ్రతగా ఉంటాను. కాని వాడికి తెలుగు వాళ్ళంటే మంట. అంచేత తప్పులు ప్రత్యేకంగా వెతకడం మొదలు పెట్టాడు. రెండు గంటలనించి ఐదు గంటలదాకా ఇన్స్పెక్షన్ సాగించాడు. కన్నాలన్నీ వెతికి పెద్ద రాద్ధాంతం చెయ్యడం సాగించాడు.

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

సుపీరియరు. ఎలాగేనా అడిగేవాడికి చెప్పేవాడు లోకువ. తల వంచక ఎలా తప్పుతుంది?

"ఎలాగో ఐదుకి వది లేదు. ఇంటికి బయలుదేరేను. మాఆవిడ సంగతి నీకు తెలీదు కాబోలు. ఓ ఛోటా జమీందారుగారి ఏకైక కుమార్తె. గారాబంగా పెరిగిందేమో పట్టుదలా శౌర్యమూ బాగా అలవడ్డాయి.

"ఎన్నోసార్లు చాలా బాధపడేవాణ్ణి. టీ ఇమ్మంటే బంట్రోతుకు చెప్పమనేది. సినీమాకి వెళ్దాం రమ్మంటే, ఇన్నాళ్లకి తమ దయ కలిగింది కాబోలు నేను రాను అనేది. అసలే రైల్వే ఉద్యోగం, అందులో దిక్కుమాలిన ఆఫీస్ గొడవ, ఇంట్లో దాని ప్రవర్తనతో నా మతి పోయేది చాలాసార్లు చెయ్యి చేసుకునేటంత కోపం వచ్చేది. కాని నా సంగతి నీకు తెలుసుగా? ఎలాగ తొందర పడడం?

"సరే. ఆనాడు ఇంటికివచ్చేసరికి చెప్పాగా నాకు చాలా చికాకుగా ఉంది. నేను వెళ్లేసరికి శారద దాని పెరుశే, కుర్చీలో కూర్చుని చదువుకుంటూంది ఏదో నవల.

"మనం చిన్నప్పుడు కాబోయే భార్యలని గురించి ఎన్ని కలలో కంటాము కాదురా! ఆఫీస్‌నుంచి మనం ఇంటికి రాగానే బట్టలు మార్చి, వాళ్ళిచ్చే నీళ్లతో కాళ్ళు కడుక్కుని నవ్వుతూ మాట్లాడుతూ, వాళ్ళిచ్చే కాఫీ త్రాగి- ఈ కలలన్నీ అందరూ కంటూరు, నేనూ కన్నాను.

"ఆరోజున ఎందుకో ఈవిషయాలన్నీ జ్ఞప్తికి వచ్చాయిరా. కోటు తీసి హేంగర్‌ని తగిలిస్తూ "శారదా! టీ ఇస్తావా?" అని అడిగాను చాలా సౌమ్యంగా నా బాధనంతటినీ అణిచిపెట్టుకుని.

"ఆమె మాట్లాడలేదు. నాకు చాలాకోపం వచ్చింది. కాని అతి కష్టంతో దానిని కనపడకుండాచేసి మళ్ళా అడిగాను.

"శారద పుస్తకం వెనకనించే "టీ లేదు" అంది. నాకోపం నక్షత్రాలతో ఆడుతోంది. అది తగ్గేదాకా ఊరుకుని "కాస్త చేసి ఇవ్వవూ?" అని అడిగాను బ్రతిమాలుతూన్నట్లు.

"నిర్లక్ష్యంగా, నేను చెయ్యలేను. వంట మనిషి ఎక్కడికో వెళ్ళింది. కావలిస్తే బంట్రోతుతో చెప్పి తెప్పించుకోండి" అంది.

"నాకు కోపం ఆగలేదు. కాని ఇంకా సముదాయించుకుని, ఆమె కూర్చున్న కుర్చీ చేతుల మీద కూర్చుని 'నువ్వు చేసి ఇస్తే ఎక్కువ సంతోషంగా ఉంటుంది. కాదూ?" అన్నాను- కోపమూ, శిక్షా సాధించలేని పనులు ప్రేమ సాధిస్తుందనీ, మంచి మాటలు చేయిస్తాయనీ, నమ్మి...

"శారద సంగతి చెప్పానుగా. ఆమెకి అసలు నేనంటే లెక్కలేదు! ఒక్కసారిగా పుస్తకం నా బుజాల మీదికేస్తూ, "నేను టీ చెయ్యాలి కాని, మీ బంట్రోతు అలిసిపోతాడేం తేవడానికి?" అంది మీ రక్తనయనాలతో.

"నాకేమీ పాలుపోలేదు. కుర్చీ మీదినుంచి లేస్తూ "చాలా పొరపాటు పడుతున్నావు శారదా!" అన్నాను నెమ్మనిగా.

"ఆమె కోపంగా "ఔను. నావన్నీ పొరపాటులే. బంట్రోతు వెధవకంటె కనికష్టంగా చూస్తున్నారు. ఏమేనా అంటే నాదే పొరపాటు ... ఛీ ... దరిద్రపు బ్రతుకు" అంది రోషంతో.

"నా కోపం హద్దులు దాటిపోయింది.

"బుద్ధి ఉండాలి శారదా! నీ సౌఖ్యంకోసం ఎంతేనా చెయ్యదలచుకునివున్నా. ఎంతనీచంగా ఆలోచిస్తున్నావు! అలాంటిదానవు పెళ్లెందుకు చేసుకొన్నావ్?" అని తిట్టాను.

"దానితో అది రెచ్చిపోయింది.

"ఏమిటా పేలాపన? మీరెంత గౌరవం ఇస్తారో అంతే పుచ్చుకుంటారనేది మరచిపోయి మాటలాడుతున్నారు. నేనేమీ దాసీదాన్ని కాదు" అని ప్రారంభించింది.

"ఎంత శాంతం గలవాడినైనా, నా కోపం హద్దులు దాటింది తీవ్రంగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ, ఒక్క లెంపకాయ తగలనిచ్చాను. గాలివానలాటి ఆమె నోరు కట్టుపడింది. వేగంగా కళ్ళమ్మట నీళ్లు రాసాగాయి. లోలోపల ఏడుస్తూ ఆమె మంచంమీద పడుకుని దిండులో ముఖం దాచుకుంది.

"ఆ వాతావరణం ఒక్కసారి చల్లారడంతో, నా మనస్సు పరిపరివిధాల పనిచెయ్య సాగింది.

నా గదికి పోయికూర్చుని ఆమెని అనవసరంగా ఎందుకు కొట్టానా అని చాలా వ్యథపడ సాగాను. బంట్రోతుచేత రెండణాలు ఇచ్చి టీ తెప్పించుకుంటే పరిపోయేదే! పాపం, ఆమె నెంతగా బాధపెట్టాను! అని అనుకున్నాను.

“మరోవేపు, నేను చేసినపని మంచిదే అంది అంతరాత్మ. ఎంతైనా మగపురుగుని కదా? ఆడదాని చేతికి అలాగ లొంగిపోతానా? ఈ దెబ్బతో బుద్ధి వస్తుందిలే అంది కూడా.

“కాని, ఈ దెబ్బతో ఆమె ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటుంది. లేదా పుట్టింటికి వెళ్ళిపోతుంది. నన్నందరూ హేళన చేస్తారు, ఆమె బ్రతికినంతకాలం బాధపడుతుంది అనుకున్నాను.

“ఏమయితేనేమిలే .. మొత్తంమీద రాత్రి తొమ్మిదయే వరకూ ఈ ఆలోచనా సముద్రంలో తేలుతూ, మునుగుతూనే ఉన్నాను. సన్యసించి కాశీ పోదామనుకున్నాను; ప్రక్క గదిలో వెక్కి వెక్కి ఏడుస్తున్న శారదని బ్రతిమలాడి, ఊరుకోబెట్టకూడదా? అని మరో సారి అనుకున్నాను. రెండు చేతులు నా టేబిల్ మీద ఉంచుకుని, నేనే ఆలోచనంతా చేసిచేసి చివరికి, ఆమెగదిలోకి వెళ్దామని లేవబోతున్నాను.

“నా టేబిల్ ప్రక్కనే పెద్ద బీరువా ఉంది. ఏ పొరపాటు వల్లనో దానిమీద చెక్కలు ఊడిపోయాయి. మీదని ఒక ఇనపకర్రలాంటిది ఉంది.

“పిల్లి ఏదో ఎలకని వెంటాడుతూ ఆ బీరువా మీదికి దూకి ఉంటుంది. ఆ గజం సరిగ్గా నా కుడిచేత ప్రేళ్ళమీద పడింది. నాలుగు ప్రేళ్ళూ దెబ్బతిన్నాయి. రక్తం రాసాగింది. నా చేతి మీద పడ్డ ఆ కర్ర ప్రక్క గ్లాసుతో సహా క్రిందకి పడింది; పెద్ద చప్పుడయింది. ఒక్క సారిగా నాకు “జరిగిన దానికి మంచి ప్రాయశ్చిత్తం అయింది. ఇంకెప్పుడూ ఆడవాళ్ళని కొట్టకు” అని ఎవరో అన్నట్లయింది.

“శారద పరిగెట్టుకువచ్చింది. టేబిల్ అంతా రక్తం అయింది. నాకు తల తిరుగుతూంది.

“ఆమె తన చీర కొంగుతో రక్తం అంతా తుడిచి, బంట్రోతును డాక్టర్ కోసం పంపింది. నన్ను మంచం మీదికి తీసికెళ్ళి పడుకోబెట్టింది.

“నా ప్రేళ్ళకి తడిగుడ్డ కడుతూ ఆమె విపరీతంగా ఏడుస్తూంది. వారిస్తూ జరిగిన సంగతి చెప్పబోయాను. కాని ఎందుకో ఆగిపోయాను.

“గాద్గదికంగా శారద అంది, ‘ఆడవాళ్ళని కొట్టడం మహా పాపమటండి?’’ అని.

“నాకేం అర్థం కాలేదు, తెల్లబోయి చూచాను.

“ఆమే మళ్ళా “నన్ను కొట్టారే అనుకోండి. దానికి అంత తీవ్రమైన శిక్ష విధించుకోవాలా? ఎంత పాపిష్టిదాన్ని!” ఆ యినప బెత్తంతో ఇంత గట్టిగా ఎలాగ కొట్టుకున్నారండీ!” అని తిరిగి ఏడుపు సాగించింది.

సరే తరవాతేదో జరిగిందనుకో. ఒక్క క్షణం ముందు నేను లేచిఉన్నా, ఆమెతో తొందరపడి జరిగిన సంగతి చెప్పేసి ఉన్నా ఈ జన్మకి శారదకి పశ్చాత్తాపం కలిగి ఉండదనుకో. అంతే కాదు, మంచిపనయిందంటుంది కూడాను. ఆ తరవాత మళ్ళీ మాఇంట కలతలు వస్తే వట్టు!”

కథ అంతా విని, సంశయంతీరక, అడిగాను. “అయితే ఇప్పటికీ చెప్పలేదేమిట్రా శారదతో నిజం?” అని.

రాజు నవ్వుతూ “ఇద్దరు పిల్లలు పుట్టేదాకా చెప్పదల్చుకోలేదురా” అన్నాడు. “కాని ఈ రహస్యం దాచలేక నీతో చెప్పాను.”

ఇంతట్లో విజయనగరం వచ్చింది. వాణ్ణి ఉండమంటే అర్జంటుగా వెళ్ళాలన్నాడు. ఇద్దరమూ మళ్ళా విడిపోయాం. వాడు రైలులో ఖరగ్‌పూర్ వెళ్ళిపోయాడు. నేను స్టేషన్ దాటి సిటీలోకి బయల్దేరాను. ప్రమాదాలకి కూడా ప్రయోజనాలుంటాయి! అని అనుకుంటూ.

ఒక ఉత్తమ పురుషుణ్ణి మనం అనుకరించడం వేరు, అతడికి నకిలీ ప్రతిగా తయారవడం వేరు. — బెంజమిన్ ఫ్రాంక్లిన్